జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

గురువారం | 23-1-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 226 పేజీలు: 4 వెల : రూ.7



# బాహుదా.. చిక్కినది

* ఇసుక బకాసురుల దాహానికి బాహుదా బలి * ఇష్టానుసారంగా తవ్వకాలు * రోజుకు వందలాది ట్రాక్టర్‌లతో ఇసుక రవాణా * ఉనికి కోల్పోతున్న నది * చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులు * కూటమి ప్రభుత్వం హయంలోనూ వైసీపీ నేతల ఇసుక దందా


**ఇచ్ఛాపురం, జనవరి22 (వార్త):** బాహుదానది ఒడిశా గోనియా బొస కొండల్లో పుట్టి.. 45 కిలోమీటర్లు ప్రయాణం చేసి.. బొడ్డబడ వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి ప్రవేశించి.. 16 కిలోమీటర్ల మేర ఇచ్ఛాపురంలో సాగునీరు, తాగునీరు అందిస్తూ.. డొంకూరు వద్ద సముద్రంలో కలుస్తుంది. అటువంటి గొప్ప నదికి చారిత్రక నేపథ్యం కూడా ఉంది. ప్రస్తుతం బాహుదా నది ఎడారిలా మారింది. బక్కచిక్కింది. నది ప్రవాహదిశ మారింది. నదిలోపల ఎత్తుపల్లాలుతో ప్రమాదకరంగా మారింది. ఇచ్ఛాపురం మండలంలో సుమారు పదివేల ఎకరాలకు సాగు ఆయకట్టుకు సాగునీరు అందించేది. లక్ష జనాభాకు తాగునీరు ఇక్కడి నుంచే అందేది. అలాగే మున్సిపాలిటీలో 23 వార్డుల ప్రజలకు 40 వేల జనాభాకు తాగునీరు అందిస్తుంది. 16 వార్డు లకు పైప్ లైన్ ద్వారా, మూడు వార్డులకు ట్యాంకర్ల ద్వారా, మరో మూడు వార్డులకు ఓవర్ హెడ్ ట్యాంక్‌ల ద్వారా నీటిని అందిస్తుంది. అటువంటి బాహుదా నది ఇసుక మాఫియా దాహానికి బలైపోతోంది. ఈ మాఫియా ధన దాహం వల్ల ప్రజల దాహం తీర్చడానికి జలం అందించలేకుండా లేకుండా పోతోంది. నదిలో భూమి లోపల కూడా పొరలు చీల్చుకుంటూ ఇసుక తవ్వేస్తుండడంతో గోతులు ఏర్పడి ఎంతోమంది ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. కోల్‌కతా చెన్నై పాత ఐదో నెంబర్ జాతీయ రహదారిపై బ్రిటిష్ కాలం నాటి చారిత్రక వంతెన కూడా ఇక మాఫియా దాటికి కుప్పకూలింది. ఇదే కోల్ కతా చెన్నై రైలు మార్గంలో కూడా రైల్వే వంతెన కింద కూడా ఇసుకను వదలడం లేదు. గత ప్రభుత్వ హయాంలో వైసిపి నాయకులు పెద్ద ఎత్తున ఇసుక దందా చేసేవారు. గత ప్రభుత్వం హయాంలోనే వంతెన కుప్పకూలింది. అయినా పట్టించుకునే నాధుడు లేడు. ప్రత్యక్షగా ఇసుక రవాణా మాత్రం పాత వంతెన కొత్త వంతెన తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ అక్రమ రవాణా చేస్తున్నారు. గతంలో సచివాలయం పనులు, నాడు నేడు పనులు, అంగన్వాడీ భవన నిర్మాణ పనులు పేరుతో ఇసుక అక్రమ రవాణా చేసేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూటమి నాయకులు, వైసిపి నాయకులు అనే తేడా లేకుండా అందరూ ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు. అరకభద్ర, కొలిగం, బొడ్డబడ, బిర్లంగి, తోటూరు, మసాకపురం, ఈదూపురం, బెల్లుపడ కొత్తవంతన ఇలా అన్నిచోట్ల ఇసుకను నిత్యం వందలాది ట్రాక్టర్లతో తరలించేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఇక్కడ ఇసుక రవాణాకు ఎటువంటి అనుమతులు లేవు. కానీ నిర్మాణాల పేరుతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తూ ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రవాణా చేస్తున్నారు. కొందరు నేతలు సిండికేట్‌గా మారి ఇసుకను తరలించేస్తున్నారు. మైన్స్, పోలీసు, రెవెన్యూ అధికారులకు ఇసుక తరలింపుపై ఫిర్యాదులు అందుతున్నా మామూళ్ల మత్తులో పట్టించుకోవడం లేదన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బాహుదా నదిని చూస్తుంటే గెడ్డ మాదిరిగా మారిపోయింది. ఒకప్పుడు విశాలంగా ఉన్న నదిని వంతెన పై నుంచి చూస్తే ఎగుడుదిగుడుగా కనిపిస్తోంది. కొందరు నేతల ధనదాహానికి బాహుదా బక్కచిక్కిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



# సరిహద్దు.. కలిసొచ్చింది!

* పొత్తంగి సరిహద్దులో యథేచ్ఛగా కంకర, మట్టి తవ్వకాలు * మందస, సోంపేట మండల అధికారుల మధ్య సమన్వయలోపం * అక్రమార్కులకు వరం * ప్రభుత్వ ఆదాయానికి గండి

**మందస, జనవరి 22(వార్త):** రెండు వాహనాలు రయ్, రయ్ మంటూ వస్తున్నాయి. కనురెప్పపాటులో ప్రమాదం జరిగింది. ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. అక్కడున్న కొందరు పోలీసులు, అధికారులకు సమాచారం ఇచ్చారు. స్పాట్ మాది కాదు అంటే.. మాది కాదు అని జవాబు వచ్చిందే తప్ప సాయం రాలేదు. మా పరిధిలో లేదని, మాకు సంబంధించిన ప్రదేశం కాదని అధికారులు చెప్పారే తప్ప.. అక్కడ జరిగిందేమిటని ఆలోచించలేకపోయారు.. ఇదంతా ఓ దర్శకుడు భవిష్యత్ పసి గట్టి సినిమా తీశాడు. దీనికి ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. ఇటువంటి ఘటనలు నిజ జీవితంలో కూడా జరుగుతున్నాయి. కట్ చేస్తే.. మందస, సోంపేట మండలాల పరిధిలో అక్రమాలు అలాగే సాగుతున్నాయి. అనధికారికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతోంది. ప్రధానంగా ప్రభుత్వ నిర్ణయానికి తూట్లు పొడుస్తూ, అక్రమంగా కంకర, మట్టిని తరలించేస్తున్నారు. రెవెన్యూ, గనులశాఖ అనుమతుల్లేకుండా వందలాది లోడులను వ్యాపారానికి తరలించేస్తున్నారు. మందస మండలంలోని పొత్తంగి గ్రామం కొంతభాగంగా ఉంది. సోంపేట మండలంలోని మరికొంతభాగంగా ఉంది. రెండు మండలాలకు సంబధించినది కావడంతో అధికారులు స్పందించడంలేదు. పత్రికల కథనాలకు కూడా చలనం లేకపోవడంతో అక్రమార్కులు తమ పనులను కొనసాగించుకున్నారు. ఎంచుకున్న స్థలంలో యంత్రాలు, ట్రాక్టర్లుతో కంకర, మట్టిని వేసి.. ఆయా స్థలాలను ప్లాట్లుగా మార్చుకుంటున్నారు. రెవెన్యూ, గనులశాఖ, పోలీసులు, సచివాలయం సిబ్బంది స్పందించడం లేదు. దీంతో స్థానికులు కొంతమంది జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఏ సమస్య వచ్చినా డబ్బుతో పరిష్కరించుకోగలమని రియల్ ఎస్టేట్ వ్యాపారులు బహిరంగంగానే చెప్పకుంటున్నారు.



# సచ్చినోడు.. మళ్లీ బతికాడు!

* అప్పారావు మృతి చెందాడని అంత్యక్రియలకు ఏర్పాట్లు * గ్రామానికి చేరుకున్న బంధువులు * పాడె కడుతుండగా ఒక్కసారిగా లేచిన అప్పారావు

**శ్రీకాకుళం క్రైం, జనవరి 22 (వార్త):** జి.సిగడాం మండలంలో జరిగిన ఓ ఘటనకు అందరూ అవాక్కయ్యారు. సీతంపేట గ్రామానికి చెందిన ధర్మవరపు అప్పారావు(85) అనారోగ్యంతో ఇటీవల శ్రీకాకుళం ఆసుపత్రిలో చేరాడు. ఆరోగ్యం క్షీణించడంతో ఇక ఎక్కువ రోజులు బతకడని వైద్యులు చెప్పడంతో బుధవారం ఉదయం అప్పారావును అంబులెన్స్‌లో సీతంపేట గ్రామానికి తీసుకువచ్చారు. మార్గమధ్యలోనే అప్పారావులో కదలిక నిలిచిపోయింది. అప్పారావు మృతి చెందాడని భావించారు. కుటుంబీకులు బంధువులకు సమాచారం ఇచ్చారు. ఇంటి వద్ద మంచంపై పడుకోబెట్టారు. కుటుంబీకులు, బంధువులంతా అప్పారావు వద్ద కన్నీరుమున్నీరవుతున్నారు. మరోపక్క పాడెకట్టి శ్మశానానికి తీసుకువెళ్లటానికి సిద్ధం చేస్తున్నారు. ఇంతలో మగత నిద్రలో పడుకుని లేచినట్టు ఒక్కసారిగా అప్పారావు లేచాడు. దీంతో అందరూ అప్పారావును చూసి అవాక్కయ్యారు. సచ్చినోడు.. మళ్లీ బతికాడు రోయ్ అంటూ కుటుంబీకులు, గ్రామస్థులు అనుకుంటూ అక్కడి నుంచి జారిపోయారు. ఈవిషయం సోషల్‌మీడియాలోనూ వైరల్ అయింది.

# పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్



**శ్రీకాకుళంక్రైం, జనవరి 22 (వార్త):** ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని పోక్సో కేసులో అరెస్టు చేశామని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. బుధవారం రణస్థలం ఎస్ఐ ఎస్.చిరంజీవితో కలిసి డీఎస్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రణస్థలం మండలానికి చెందిన నారు ప్రసాద్ భోగీ రోజు తన ఇంటి ముందు ఆడుకుంటున్న బాలికను మాయమాటలు చెప్పి సచివాలయంపైకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడన్నారు. బాధితురాలు ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసిందని, దీంతో వారు ఈనెల 20న రణస్థలం పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఎస్ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేశారని తెలిపారు. రణస్థలం మండలం కంబాలపేట సమీపంలోని ఆర్చి వద్ద ఈనెల 21న నిందితుడు నారు ప్రసాద్‌ను ఎస్ఐ చిరంజీవి అరెస్ట్ చేశారని, బుధవారం రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ పేర్కొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## కొత్తపేటలో మహా అన్నదానం



**కోటబొమ్మాళి, జనవరి 22(వార్త):** అయోధ్యలో బాలరాముడును ప్రతిష్ఠించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం కొత్తపేట గ్రామంలో సుమారు 5వేలమందికి మహా అన్నదానం నిర్వహించారు. మండల నలుమూలల నుంచి భారీ సంఖ్యలో రామభక్తులు, మహిళలు కొత్తపేట శివకేశవ ఆలయం నుంచి ర్యాలీగా శ్రీరామనామస్మరణతో కోటబొమ్మాళి రైతుబజారు వరకు వచ్చి తిరిగి ఆలయానికి చేరుకున్నారు. దీంతో కోటబొమ్మాళి, కొత్తపేట గ్రామాలు రామనామస్మరణతో మారుమ్రోగాయి.

# శరవేగంగా రథసప్తమి ఉత్సవాల ఏర్పాట్లు

**- పనులు పరిశీలించిన ఎమ్మెల్యే శంకర్**



**శ్రీకాకుళం, జనవరి 22(వార్త):** రథసప్తమి ఉత్సవాల పనులను ఎమ్మెల్యే గొండు శంకర్ బుధవారం పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. రథసప్తమి ఉత్సవాలు రాష్ట్ర పండుగగా గుర్తించిన నేపథ్యంలో భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంద్ర పుష్కరిణి పరిసరాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో భద్రాజి, మున్సిపల్ ఎంఈ దక్షిణామూర్తి, ఎండోమెంట్ సర్వేయర్ దుర్గాప్రసాద్, ఎండోమెంట్ జేఈ టి.చందన, మున్సిపల్ సర్వేయర్ జి.అప్పారావు, తెదేపా నాయకులు ఉంగటి రమణమూర్తి, కాంట్రాక్టర్ ఉంగటి పాపారావు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పశు వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి




**జలుమూరు, జనవరి 22(వార్త):** ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. లింగాలవలస గ్రామంలో పశుసంవర్ధక శాఖ బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పశువైద్య శిబిరం ఏర్పాట్లు పరిశీలించి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా అడుగులు వేస్తుందన్నారు. పాడి పశువులతో నిత్యం ఆదాయం ఉంటుందన్నారు. నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, పశువ్యాధి నిర్ధారణ పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, శాస్త్రీయ యాజమాన్యంపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.రాజగోపాలరావు, టెక్కలి ఉప సంచాలకులు జయరాజ్, డీఎల్డీవో సత్యప్రకాష్, కోటబొమ్మాళి సహాయ సంచాలకులు లోకనాథం, వెటర్నరీ అసిస్టెంట్, డాక్టర్లు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, నీటి సంఘం సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, పాడి రైతులు పాల్గొన్నారు.

# గిరిజన వర్సిటీకి గిడుగు పేరు పెట్టాలి



**శ్రీకాకుళం, జనవరి 22(వార్త):** విజయనగరంలో గల కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి గిడుగు రామమూర్తి పేరు పెట్టాలని శ్రీకాకుళం తెలుగు రచయితల వేదిక(తెరవే) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. బుధవారం కొత్త బ్రిడ్జి రోడ్డులో గల దత్తగుడి సమీపంలోని గిడుగు రామమూర్తి విగ్రహం వద్ద ఆయన 85వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అభినవ వాగనుశాసనునిగా, సవర భాషా సూరీడుగా ఎనలేని గుర్తింపు పొందిన గిడుగు రామమూర్తి పేరును గిరిజన వర్సిటీకి పేరు పెట్టాలని అఖిలభారత సవర భాషా సంఘం గతంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని తెరవే గుర్తు చేసింది. ఈ విషయమై ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సభ్యులు కోరారు.

సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, రఘుపాత్రుని వెంకట రమణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్ధంతి కార్యక్రమంలో సభ్యులు, ఐ.యన్.డి ప్రసాద్, ఉమామహేశ్వరరావు, పూడి జనార్ధన్‌రావు, వి.రాజారావు, డబ్బీరు గోవిందరావు పి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొని గిడుగుకు నివాళులర్పించారు.

# విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే శిరీష



**మందస, జనవరి 22(వార్త):** విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పలాస ఎంఎల్ఏ గౌతు శిరీషా అన్నారు. మందస మండలంలోని బొగాబంద లో మహత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.33.30లక్షలతో ఎంపీయూపీ పాఠశాలకు మంజూరైన కాంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గత ప్రభుత్వం కేవలం అంకెల గారడీతో మాయ చేసిందని విమర్శించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గ్రామాల్లో మౌళిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పీరుకట్ల విఠల్రావు, రట్టి లింగరాజు, స్థానిక నాయకలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజా గ్రీవెన్స్




**శ్రీకాకుళం, జనవరి 22(వార్త):** ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. విశాఖ ఏ కాలనీలోని తన కార్యాలయంలో గార, శ్రీకాకుళం మండలాల ప్రజల నుంచి వినతులను బుధవారం ఆయన స్వీకరించారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్లు, రోడ్లు, కాలువల నిర్మాణానికి అధికంగా అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్య పాలనతో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే 15వ ఆర్థిక సంఘం నిధులను గ్రామ పంచాయతీలకు విడుదల చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒకే రోజులో వేలాదిగా గ్రామసభలు నిర్వహించి పల్లెల్లోని సమస్యలను గుర్తించామన్నారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టి పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొనే దిశగా కొనసాగుతామన్నారు. సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని చెప్పారు. ఒక్క ఛాన్స్ ఇచ్చిన పాపానికి జగన్ రెడ్డి రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారని విమర్శించారు. రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలను నాశనం చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని చెప్పారు. గ్రామ స్వరాజ్య పాలన కోసం గాంధీజీ కలలు కన్నా ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. కార్యక్రమంలో గార మండల టీడీపీ, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## వైకుంఠపురం-అల్లిపల్లిగూడకు బీటీ రోడ్డు

**బూర్జ, జనవరి 22(వార్త):** వైకుంఠపురం నుంచి అల్లిపల్లి గూడకు బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే కూన రవికుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు. సుమారు కోటి రూపాయల నిధులతో ఈ పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.విశ్వప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ అనెపు రామకృష్ణ, గ్రంథాలయ మాజీ చైర్మన్ పైడి సత్యప్రసాద్, మాజీ జడ్పీటీసీ పీరుకట్ల సేతుబాబు, మాజీ సర్పంచ్ ఎన్.సత్యం, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా ఉద్యోగావకాశాలు

**పలాస, జనవరి 22(వార్త):** ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో 500 కంపెనీల్లో కోటి మందికి నైపుణ్యాలు కల్పించే అవకాశం కల్పించిందన్నారు. ఈ పథకానికి పదో తరగతి, పాలిటెక్నిక్, బీబీఏ, బీఎస్సీ, ఐటీఐ, బీఫార్మసీ చదివి ఉండి, 18 నుంచి 24 ఏళ్లలోపు కలిగి ఉండాలని పేర్కొన్నారు. కుటుంబ ఆదాయం ఏడాదికి 8 లక్షల లోపు ఉండాలన్నారు. రూ.5000 నుంచి రూ.6000 వరకు స్టైఫండ్ ఇస్తారని తెలిపారు. ఈ ఇంటర్న్‌షిప్ కాల వ్యవధి 12 నెలలని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఈ నెల 27లోగా https://pmintership.mca.gov.in/login/లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## రేపు విద్యుత్ అంతరాయం

**కొత్తూరు, జనవరి 22(వార్త):** కొత్తూరు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ జి.శంకరరావు తెలిపారు. కొత్తూరు 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో పనుల నిర్వహణ నిమిత్తము విద్యుత్ సంఫరా నిలిపివేస్తామన్నారు. దీంతో కొత్తూరు, మహాసింగి, బడిగాం, కుంటిభద్ర, వసప కాలనీ, మెట్టూరు, నీలకంఠపురం, లబ్బ, గొట్టిపల్లి పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## నేడు బొడ్డపాడు లేఅవుట్ ఎంఐజీ ఫేజ్-1కు డ్రా

**పలాస, జనవరి 22(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం ఎన్టీఆర్ హౌసింగ్ స్కీంలో భాగంగా, బొడ్డపాడు లేఅవుట్‌లో ఎంఐజీ ఫేజ్-1కు సంబంధించి గురువారం ఉదయం 10 గంటలకు 255 ప్లాట్ల డ్రా తీస్తారని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు తెలిపారు. ఎమ్మెల్యే గౌతు శిరీష, కలెక్టర్, జాయింట్ కలెక్టర్, సుడా చైర్మన్ సమక్షంలో డ్రా తీస్తామన్నారు. దరఖాస్తుదారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

## ఉల్లాస్‌పై నేడు శిక్షణ

**వంగర, జనవరి 22(వార్త):** వంగర మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటల నుంచి ఉల్లాస్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లోపింటి త్రినాథరావు తెలిపారు. ఈ శిక్షణకు అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

## మందసలో నేడు మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలు

**మందస, జనవరి 22(వార్త):** మందస మండలంలో ఈనెల 23న మంత్రి లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు భావన దుర్యోధన తెలిపారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు మందస ఎంఎ యూపీ(బీసీ) స్కూల్, బీవైఆర్ పురం ఎంపీ యూపీ స్కూల్ లో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేస్తామన్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కార్యకర్తలు హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## వైద్యశిబిరంలో 105 మందికి పరీక్షలు

**ఇచ్ఛాపురం, జనవరి 22(వార్త):** ఇచ్ఛాపురం జేసీఐ, ఏఆర్ఎస్ క్లినిక్ ఆధ్వర్యంలో ఏఆర్ఎస్ క్లినిక్‌లో ఉచితంగా లివర్ హెల్త్ చెకప్, స్కానింగ్ పరీక్షలు బుధవారం చేశారు. డా.టీవీ ప్రదీప్ పర్యవేక్షణలో 105 మందికి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జేసీఐ ఇచ్ఛాపురం ప్రెసిడెంట్ కాళ్ల జైదేవ్, సెక్రటరీ డా.మోహన్ వెంకటేష్, తంగుడు షణ్ముఖరావు, వెచ్చా రాము, సంతోష్, బి.శ్రావణ్, స్వరూప్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## 70సార్లు రక్తదానం చేసిన మధుబాబు



**మందస, జనవరి 22(వార్త):** తోటి మనిషికి సాయం చేయాలన్న తలంపు ఉండాలే కానీ,అది ఏరూపంలోనైనా చేయవచ్చు. ఆపదలో ఉన్న మనిషికి రక్తదానం చేయాలన్న తలంపును నిజం చేస్తున్నారు మందసకు చెందిన మోణంగి మధుబాబు. రక్తదానం చేయడంతో ఆయనకు ఆయనే సాటి. చిత్తశుద్ధితో రక్తదానం చేసి, పలువురుని, ఆదుకుంటూ.. సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మధుబాబు ఇప్పటి వరకు 70సార్లు రక్తదానం చేసి, రికార్డు సృష్టించారు. రక్తదానం చేస్తే.. ఆరోగ్యం చెడిపోతుంది, ఇతరులకు రక్తదానం చేయకూడదు.. అనే ప్రచారాలను పారద్రోలి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. పలువురి అభినందనలు అందుకుంటున్నారు. రక్తదానంతో పాటు అవయవదానం చేయాలని ఆయన హితబోధ చేస్తుంటారు. ఇదే కదా సమాజానికి కావాల్సిన ఆదర్శం.



## గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు

**మందస, జనవరి 22(వార్త):** ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి కోరారు. లొహరిబంద సచివాలయం పరిధిలో బుధవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. వ్యాధినిరోధక టీకాలు వేయడం, దూడలకు అంతర పరాన్న జీవులు మందులు తాగించారు. పాడి రైతులకు పశు పోషణలో మేలైన యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి కొరికన వల్లభరావు, మార్పు మాధవరావు, మార్పు సత్యనారాయణ, నర్తు దివాకర్, దాసరి సుధాకర్ తదితర పాడి రైతులు, సిబ్బంది బాలకృష్ణ, శ్రీను, సంతోషి, హరికృష్ణ, నిత్యానందం, కళ్యాణ్, నేతాజీ, లక్ష్మి, పార్వతి, రాజ్యలక్ష్మి, ఉమా, మురళి, ఇంతియాజ్, పురుషోత్తం పాల్గొన్నారు.

## వాతావరణ మార్పులపై ఆదివాసీ యువతకు శిక్షణ




**కొత్తూరు, జనవరి 22(వార్త):** కొత్తూరు మండలం వెలుగు అసోసియేషన్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థ డైరెక్టర్ సంజీవరావు ఆదివాసీ యువతకు వాతావరణ మార్పులు-వాటి ప్రభావాలు, నివారణ చర్యలపై బుధవారం శిక్షణ ఇచ్చారు. ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు హరికుమార్, కిరణ్, సునీత, భాగ్యలక్ష్మి మాట్లాడుతూ జీడి మామిడి, పసుపు, పైనాపిల్ తదితర పంటల సాగుపై అవగాహన కల్పించారు.

## జాతీయ పోటీలకు శిక్షణ ప్రారంభం




**పలాస, జనవరి 22(వార్త):** క్రీడాకారులు జాతీయ పోటీలకు ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమని జిల్లా టెన్నికాయిట్ సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు మల్ల సంతోష్, ఎస్వీ జోగారావు అన్నారు. జాతీయ టెన్నికాయిట్ పోటీలకు శిక్షణ శిబిరం పలాస క్రీడా మైదానంలో బుధవారం ప్రారంభమైంది.కార్యక్రమంలో క్రీడా ప్రోత్సాహకులు ఎం.భద్రయ్య, జె.మల్లేశ్వరరావు, రవిశంకర్‌గుప్తా, కె.తారక్, కె.శంకరరావు, వ్యాయామ విద్య ఉపాధ్యాయులు పి.తవిటయ్య, బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం మరొకరికి ప్రాణదానం

**వజ్రపుకొత్తూరు, జనవరి 22(వార్త):** రక్తదానం మరొకరికి ప్రాణదానమని రాష్ట్ర అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి కర్ని రమణ అన్నారు. మంత్రి లోకేష్‌బాబు జన్మదినం సందర్భంగా మెగా రక్తదానం శిబిరం నిర్వహించారు. పలాస ఎమ్మెల్యే గౌతుశిరీష పిలుపుమేరకు నియోజవర్గం స్థాయిలో అనూహ్యరీతిలో యువకులు ,మహిళలు ముందుకొచ్చి ఈ మెగారక్త దానం కార్యక్రమం శతశాతం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి గ్లో సృష్టికర్త వెంకన్న చౌదరి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కృష్ణార్జున యువసైన్యం కుటుంబసభ్యులు రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, మండల టిడిపి పార్టీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ సమక్షంలో 23 మంది రక్తదానం చేశారు.



# గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు



**శ్రీకాకుళం, జనవరి 22(వార్త):** గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సూచించారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమాయత్తమైందని ఆయన చెప్పారు. బుధవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో జిల్లా జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర్ రెడ్డితో కలసి వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. మైదానాన్ని అత్యంత పరిశుభ్రంగా ఉంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రజలందరూ కూర్చొని వేడుకలను వీక్షించేందుకు సరిపడా సౌకర్యవంతమైన సీట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు.

ప్రజలు, ఆహ్వానితుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ మహేశ్వర్ రెడ్డి పోలీసులకు సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వాతంత్ర్య సమరయోధులకు ప్రత్యేక సీట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈసారి ప్రత్యేకంగా స్టాళ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధి కారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను విజ యవంతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఈ పర్యటనలో డిఆర్ఓ వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప పద్మా వతి, ఆర్‌డిఓ సాయి ప్రత్యూష, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, డిఆర్‌డిఏ పీడీ కిరణ్ కుమార్, డిఎస్పి సిహెచ్ వివేకానంద, డిఎస్‌డిఓ శ్రీధర్, ఆర్అండ్‌బి ఎస్ఈ జాన్ సుధాకర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్లో రక్తదాన శిబిరానికి విశేష స్పందన

**-738 మంది రక్తదానం**



**పలాస, జనవరి 22(వార్త):** నిత్య జీవితంలో ఎంతో మందికి సకాలంలో రక్తం అందక ప్రాణాలు కోల్పోతున్నారని, అటువంటి పరిస్థితి ఏర్పడకుండా యువత రక్తదానం చేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం విశాఖపట్నం ఎన్టీఆర్ ట్రస్ట్, శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రి, టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రి, కాశీబుగ్గ ప్రాణదాత, శ్రీకాకుళం రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, పలాస నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్న చౌదరి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌతు శిరీష మాట్లాడుతూ రక్తదానంలో పలాసది మొదటి స్థానమని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో రాయదుర్గం నియోజకవర్గంలో 725 మంది చేయగా పలాసలో 738 యూనిట్లు సేకరించామని తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా మరికొన్ని ప్రాణాలు కాపాడవచ్చున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, గురిటి సూర్యనారాయణ, దువ్వాడ శ్రీకాంత్, గోళ్ల చంద్రరావు, మల్ల శ్రీనివాస రావు, కొరికాన శంకర్రావు, శాసుమాన చంద్రమౌళి, డొక్కర. శంకర్, మండల తెలుగు యువత అధ్యక్షులు కుత్తుం లక్ష్మణ్, కిక్కిర ఢిల్లీ రావు, కూటమి నాయకులు రామానందస్వామి, వైశ్యరాజు రాజు పాల్గొన్నారు.

## మూఢ నమ్మకాల నివారణపై చైతన్యపరచాలి



**మందస, జనవరి 22(వార్త):** మూఢ నమ్మకాలను పారద్రోలడానికి చైతన్యం ఎంతో అవసరమని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు అన్నారు. బుధవారం హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక నాయకులు గొంటి గిరిధర్, బొడ్డేపల్లి మోహనరావు, పాలవలస ధర్మారావు, కుప్పిలి కామేశ్వరరావు, ఎ.వాసుదేవరావు, పి.జగదీశ్వరరావు, ఆర్.సురేష్ మాట్లాడుతూ పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం అభివృద్ధి పరిచేలా బోధన చేయాలని, మూఢనమ్మకాలను పారద్రోలడానికి తగిన చైతన్యాన్ని కల్పించాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి28న సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని యురేకా సైన్స్ ఎక్స్పో-2025నకు సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం-సుస్థిర అభివృద్ధి, మూఢ నమ్మకాలు-శాస్త్రీయ దృక్పథం అనే అంశాలపై 8, 9, 10వ తరగతి నుంచి ముగ్గురు విద్యార్థులు బృందాలుగా ఐదు నిమిషాలకు మించకుండా ప్రయోగాన్ని వీడియో రూపంలో గూగుల్ ఫామ్ లింక్ ద్వారా పంపవచ్చని తెలిపారు. ఫలితాలను ఆ రోజున ప్రకటిస్తామన్నారు. వివరాలకు జేవీవీ నాయకుడు మహేష్-9398524988 సంప్రదించాలని కోరారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.ఉమారాజ్, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండ రావు, ఉపాధ్యాయులు ఎల్.సాంబమూర్తి, జి.రమణబాబు, ఎం.చక్రధరరావు, జి.తేజేశ్వరరావు, కె.అరుణకుమారి, పి.జగన్మోహన్ రావు, సంతోష్ కుమార్ పండ, పి.లోకనాథం, ఎన్.ఈశ్వరి, బి.శశికళ, కె.మంజుల, ఇందుమతిపాత్రో, టి.కృష్ణవేణి, డీవీఎస్ కిరణ్, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

## జీడి మామిడి పంటలపై రైతులకు అవగాహన

**వజ్రపుకొత్తూరు, జనవరి 22(వార్త):** జీడి రైతులు సకాలంలో ఉద్యాన శాఖ అధికారులు సూచనల మేరకు ఎరువులు మందులు వాడినట్లయితే దిగుబడి వస్తుందని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎల్.వి మధు అన్నారు. బుధవారం దేవునల్తాడ గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడి పంట పూత దశలో ఉండేటప్పుడే కొన్ని క్రిమిసంహారక మందులు వాడాలన్నారు. జీడి మామిడి తోటలకు మూడుసార్లు ఇందించలోప్డడ్, లంద కాలీలోత్రిన్, ప్రొఫెనోఫోస్, మందులు పిచికారి చేయాలని ఆయన రైతులకు సూచించారు. అపరాలు మల్టిక్ ఒక కేజీ ఎకరానికి పూత దశలో ఉండేటప్పుడు పిచికారీ చేయాలన్నారు. పూత మాడిపోయినప్పుడు ప్రోపికోనోజోల్ మందను 300 మిల్లీ లీటర్లు పిచికారి చేయాలని రైతులకు సూచించారు. రబీ సీజన్లో రైతులు అపరాలు, రాగి , వేరుశనగ, వరి పంటలకు సకాలంలో జాగ్రత్తలు తీసుకుంటే ఆశించిన స్థాయిలో పంట దిగుబడి వస్తుందని, ముఖ్యంగా పురుగులు తెగుళ్లు సోకినప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి కిరణ్ వాణీ, దేవునల్తాడ సచివాలయం వ్యవసాయ శాఖ అధికారి శివ, రైతులు తదితరులు పాల్గొన్నారు.




## ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్ట్ వద్దు

**-ఉద్యానవన యూనివర్సిటీ బోర్డ్ మెంబర్ బత్తిని లక్ష్మణ్**



**మందస, జనవరి 22(వార్త):** ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్ట్ నిర్మించవద్దని, పచ్చని పల్లెలకు అన్యాయం చేయవద్దని డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డ్ మెంబర్ బత్తిని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక బహిరంగ లేఖ రాశారు. ఆరేళ్ల క్రితం వచ్చిన తిత్లీ తుఫాన్ ఉద్దానం రైతులకి జీవనాధారమైన కొబ్బరి, జీడి, పనస, మునగ మామిడి తదితర ప్రధానమైన పంటలకు తీవ్ర నష్టం కలిగించిందన్నారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్ట్ వస్తుందంటూ జిల్లా ఉన్నతాధికారులు తెచ్చిన పిడుగు లాంటి వార్త విని ఆవేదన చెందుతున్నామన్నారు. భేతాళపురం, రాంపురం, చీపురుపల్లి, 16 గ్రామాల్లోని బాధిత రైతులు రాజకీయ పార్టీకతీతంగా 75 రోజులుగా నిరంతరం ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమాలు చేస్తున్నారన్నారు. కార్గో ఎయిర్పోర్ట్ వద్దని ప్రభుత్వానికి కోరుతున్నామన్నారు. శాసనసభ్యురాలు శిరీష వజ్రపుకొత్తూరు మండల సమావేశంలో మాట్లాడుతూ రైతుల అనుమతి లేకుండా సెంటు భూమి కూడా తీసుకోమని చెప్పడం చాలా శుభపరిణామన్నారు. కొబ్బరి, జీడి బోర్డులు ఏర్పాటు చేసి, జీడిపిక్కలకి మద్దతు ధర కల్పించాలని కోరారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

**సారవకోట, జనవరి 22 (వార్త):** పది పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని డీఈవో తిరుమల చైతన్య అన్నారు. బుధవారం సారవకోట, అలుదు హైస్కూలు, ఎంఆర్‌సీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు బోధన ఏవిధంగా అందుతుందో ఆరా తీశారు. పలు అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. సాయంత్రం అదనంగా ఒక గంట పాటు ఉండి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. 60 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు మోడల్ ప్రైమరీ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో భాగంగా సారవకోట మండలానికి సంబంధించి సారవకోట. అలుదు, చీడిపూడి, బద్రి, పెద్దలంబ పాఠశాలను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఈ పాఠశాలలకు సంబంధించి ఐదుగురు ఉపాధ్యాయులు పనిచేస్తూ అన్ని సబ్జెక్టులను బోధిస్తారని చెప్పారు. ఆయన వెంట డైట్ ప్రిన్సిపాల్ గౌరీ శంకర్‌రావు. ఎంఈవో వెంకటరమణ. హెచ్‌ఎంలు రామకృష్ణ పట్నాయక్, రామారావు, ఎమ్మార్పీలు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

☞ హిట్ అండ్ రన్ కేసులు త్వరితగతిన ఛేదించండి ☞ జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ☞ డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో జూమ్ కాన్ఫరెన్స్

**శ్రీకాకుళం క్రైం, జనవరి22 (వార్త):** అపరిష్కృతంగా ఉన్న మహిళలు, చిన్నారులపై జరిగే కేసులు, ఎస్సీ.ఎస్టీ అత్యాచార కేసులు, హిట్ అండ్ రన్ కేసులపై దృష్టి కేంద్రీకరించి, వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో అదనపు ఎస్పీ కేవీ రమణతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా అభియోగ పత్రాలు కోర్టులో దాఖలు చేయాలన్నారు. పోక్సో, రేప్ వంటి కేసులలో కేసు నమోదు నుంచి ఛార్జ్ షీట్ దాఖలు వరకు సాక్ష్యాధారాలుసేకరణ, ఇన్వెస్టిగేషన్ పూర్తి స్థాయిలో చేపట్టాలన్నారు. ఇప్పటి వరకూ నమో దైన అట్రాసిటీ కేసుల వివరాలను, దర్యాప్తు గురించి ఆరా తీసి పలు కేసుల దర్యాప్తు ప్రగతిని,ప్రస్తుత స్థితిని డిఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. కుల ధ్రువీకరణ పత్రాలను సమర్పించడంలో అలసత్వం వహించ రాదన్నారు. అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచిం చారు. టోల్ గేట్లు, ముఖ్య కూడలిలో ఉన్న కెమెరాలు క్షుణ్ణంగా పరిశీలనతో కేసులు త్వరితగతిన ఛేదించా లన్నారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి డ్రమ్స్,స్పీడ్ బ్రేకర్స్, రేడియం స్టిక్కర్స్, ప్రమాద హెచ్చ రిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలన్నారు.




### టూ టౌన్ పీఎస్ పరిధిలో డ్రోన్ నిఘా



శ్రీకాకుళం రెండవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో పోలీసులు నిర్మానుష్యమైన ప్రదేశాలలో డ్రోన్ నిఘా పెట్టి, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేశారు. బుధవారం పి.ఎన్ కాలనీ, బైరవానిపేట, కిమ్స్ హాస్పటల్, శాంతి నగర్ కాలనీ, సీపాన నాయుడు పేట, బలగ తదితర నది పరివాహక ప్రాంతాలు, పట్టణ చివర ప్రాంతాలలో పోలీసులు డ్రోన్‌ను ఎగురవేశారు.

# భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు

● ఎచ్చెర్ల శాసనసభ్యుడు నడుకుదుటి ఈశ్వరరావు ● కమ్మసిగడాం శ్రీమహలక్ష్మి తల్లి జాతర గోడపత్రిక ఆవిష్కరణ

**రణస్థలం, జనవరి 22(వార్త):** కమ్మసిగడాం శ్రీమహలక్ష్మి తల్లి జాతరకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్టు కమ్మసిగడాం శ్రీమహలక్ష్మి తల్లి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి, ఎచ్చెర్ల శాసన సభ్యుడు నడుకుదుటి ఈశ్వరరావు తెలిపారు. కమ్మ సిగడాం శ్రీమహలక్ష్మి తల్లి జాతర ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో జరుగనున్న దృష్ట్యా ఇందుకు సంబంధించిన గోడ పత్రికను ఎమ్మెల్యే నడుకుదుటి ఈశ్వరరావు, కమిటీ సభ్యులు బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎన్ఈఆర్ మాట్లాడుతూ, జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, రథసప్తమి మంగళవారం ఉదయం 11 గంటలకు పెళ్ళిరాట వేయటం జరుగుతుందన్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. వ్యాపారస్థులు ముందస్తుగా వచ్చి తాము వ్యాపారం చేసుకోవాలనుకునే స్థలాలు బాగు చేసుకోవాలని సూచించారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు, ఒడిశా నుంచి పెద్దఎత్తున యాత్రికులు కమ్మ సిగడాం శ్రీమహలక్ష్మి తల్లి జాతరకు తరలివస్తారని చెప్పారు. ఈ మేరకు ఆలయ కమిటీ తగు ఏర్పాట్లు పూర్తిచేసిందని తెలిపారు. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకో కుండా పోలీసుశాఖ తగు బందోబస్తు నిర్వహించాల న్నారు. గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు వెలిచేటి రామకృష్ణ, వెలిచేటి రాజారవిచంద్ర, సూర్యతేజ, కోశాధికారి వెలిచేటి రాజశేఖర్, కార్యదర్శి మన్నె లక్ష్మీప్రసాద్, వెలిచేటి సురేష్‌కుమార్, సింహాచల రాయుడు, వీజేఎస్ఎల్‌పీ.మౌళి, గురాల రఘునాథ్, మన్నె వరహమూర్తి, గోపిన కృష్ణారావు, నడుకుదుటి గిరి తదితరులు పాల్గొన్నారు.



## జోడూరు వద్ద ద్విచక్రవాహనం బోల్తా

**మెళియాపుట్టి, జనవరి 22 (వార్త):** పెద్ద లక్ష్మీపురం గ్రామానికి చెందిన సోనాపురం జోగారావు, హేమలత దంపతులు సంక్రాంతి నేపథ్యంలో ద్విచక్రవాహనంపై ఇటీవల తన అత్తవారింటికి నౌగాం వెళ్ళి తిరిగి వస్తున్న క్రమంలో జోడూరు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి ఆఫ్‌షోర్ రిజర్వాయర్ లోయలో పడిపో యింది. దీంతో దంపతులిద్దరూ అపస్మారక స్థితిలోకి జారుకున్నారు. అయితే అటుగా వస్తోన్న ఆటో డ్రైవర్ ప్రమాదాన్ని గుర్తించి వారిని మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురాగా వైద్యురాలు గ్రీష్మ వారికి చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం టెక్కలి సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ గుర్తించి స్పందించ డంతో పెను ప్రమాదం తృటిలో తప్పిందని వైద్యురాలు గ్రీష్మ తెలిపారు.

## ఎంఈవోగా శ్రీరాములు

**పొందూరు, జనవరి 22 (వార్త):** మండల విద్యా శాఖాధికారి–1గా ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యుడు జి.శ్రీరాములు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకు ఇక్కడ ఎంఈవో–1గా పనిచేస్తూ డీసీఈబీ సెక్రటరీగా ఉన్న రాజేంద్ర ప్రసాద్ తిరిగి మాతృ స్థానానికి వెళ్లిపోయారు. ఎంఈవో–1గా బాధ్యతలు చేపట్టిన శ్రీరాములను ఎంఈవో–2 పట్నాన రాజారావు, ఎమ్మార్పీ, భవిత కేంద్రం సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు.

### నాడు-నేడు రికార్డులు

## అందుబాటులో ఉంచాలి

● డిప్యూటీ డీఈవో విజయకుమారి

**పొందూరు, జనవరి 22(వార్త):** నాడు–నేడు పనులు చేపట్టిన పాఠశాలల్లో దీనికి సంబంధించిన దస్త్రాలను అందుబాటులో ఉంచాలని డిప్యూటీ డీఈవో విజయకుమారి అన్నారు. మండలంలోని లోలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆమె ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నాడు– నేడు పనులు జరిగిన పాఠశాలల్లో సామాజిక తనిఖీలు జరుగుతున్నా యని, దస్త్రాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. టీఐఎస్ శతశాతం పూర్తిచేయాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులదేనన్నారు. ఈమెతోపాటు ఎంఈవో పట్నాన రాజారావు, హెచ్‌ఎం సంజీవరావు ఉన్నారు.

## ఆచమ్మ నేత్రాలు సజీవం

**శ్రీకాకుళం, జనవరి 22 (వార్త):** శ్రీకాకుళం జిల్లా కళ్యాణ మగటపల్లి కంటి సేకరణ కేంద్రం సిబ్బంది దివంగత పంగ ఆచమ్మ (70) నుంచి రెండు కార్నియాలు సేకరించారు. కొత్త దమ్మల వీధికి చెందిన ఆమె కంటి కార్నియాలు దానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు కాంతి నిచ్చే గొప్ప కార్యానికి ఆమె కుటుంబ సభ్యులు నిర్ణయించు కున్నారు. దివంగత పంగ ఆచమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, ఆమె కుటుంబ సభ్యులకు రెడ్‌క్రాస్ బృందం సంతాపం తెలియ జేసింది. ఆమె చేసిన కంటి దానం అనేక కుటుం బాలకు ఆనందాన్ని నింపిందని బుధవారం పేర్కొ న్నారు. అంధత్వంతో బాధపడుతున్న వారికి కొత్త జీవితాన్ని ఇచ్చిన ఆమె కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపింది.

## ఎస్పీని కలిసిన మందస ఎస్ఐ



**శ్రీకాకుళం క్రైం, జనవరి22 (వార్త):** మందస ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన కె.కృష్ణ ప్రసాద్ బుధవారం ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణ ప్రసాద్ శ్రీకాకుళం సీపీఎస్ పీఎస్ నుంచి మందసకు బదిలీపై వచ్చారు.

# భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్.జోసెఫ్ ● పరిష్కారమైన సమస్యలపై ఆరా

**సంతకవిటి, జనవరి 22 (వార్త):** రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్య ల పరిష్కారమే లక్ష్యమని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్.జోసఫ్ అన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యల ఫిర్యాదులపై సంతకవిటి తహసీల్దా ర్ కార్యాలయంలో బుధవారం సమీక్ష నిర్వహిం చారు. గత ఏడాది డిసెంబరు 21 నుంచి ఈ ఏడాది జనవరి 8వ తేదీ వరకు జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. సంతకవిటి మండలం లో భూ సమస్యల పరిష్కారానికి సంబంధించి 183 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటివరకు 127 పరిష్కరించామన్నారు. 127 మంది ఫిర్యాదుదారులతో ఆయన నేరుగా ఫోన్ లో మాట్లాడి భూ సమస్య పరిష్కరించారా.. పరిష్కరించిన సమస్యకు సంతృప్తి చెందారా.. అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిగిలిన 56 ఫిర్యాదులు వేగవంతంగా పరిష్కరించాలని తహసీల్దార్ సత్యం, వీఆర్వోలకు సూచించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించినట్లు తెలిపారు. మండలాలవారీగా భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. రేగిడి మండలం లో 152 ఫిర్యాదులు రాగా, 74 పరిష్కారమయ్యా యని, వంగర మండలంలో 115 ఫిర్యాదులకు 70 పరిష్కారమైనట్లు తెలిపారు. రాజాం మండల పరిధిలో 173 ఫిర్యాదులు రాగా, 122 సమస్య లు పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. శత శాతం భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తహ సీల్దార్లకు సూచించామని ఆయన వివరించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546